క్లుప్తంగా

ఆళ్లగడ్డ రూరల్ సీఐగా కంబగిరి రాముడు

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ రూరల్ సీఐగా కంబగిరిరాముడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న హనుమంత్‌నాయక్ కోవెలకుంట్లకు బదిలీపై వెళ్లారు. శాంతిభద్రతల విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోటపాడు యువకుడు ఎంపిక

శిరివెళ్ల: మండలంలోని కోటపాడుకు చెందిన మేర్వ సునీల్‌కుమార్‌రెడ్డి కేంద్ర జల సంఘం అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుకు ఎంపికయ్యాడు. ఈ యువకుడు గతేడాది నవంబర్‌లో యూపీపీఎస్సీ ఈఎస్ఈ విభాగం పరీక్ష రాసి ఆల్ ఇండియా లెవల్‌లో 31వ ర్యాంక్ సాధించాడు. తాజాగా యూపీపీఎస్సీ ఆ యువకుడిని పోస్టుకు ఎంపికైనట్లు సమాచారం అందించింది. 7 నెలల పాటు పూనేలో శిక్షణ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వనున్నట్లు సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

నంద్యాల విద్యుత్ శాఖ ఈఈగా శ్రీనివాసరెడ్డి

నంద్యాల(అర్బన్): నంద్యాల విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా శ్రీనివాసరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. నంద్యాలలో విధులు నిర్వహిస్తున్న ఈఈ రమణారెడ్డి ప్రొద్దుటూరుకు బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి నంద్యాల ఈఈగా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఏఈలు రామయ్య, సుబ్బారావు, ప్రభాకర్‌రెడ్డి, కవితలతో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

నీటి హక్కులను కాపాడాలి

నంద్యాల(అర్బన్): గోదావరి నది జలాల సమస్యలను విశ్లేషించి రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సోమన్న కోరారు. సాగునీటి హక్కులకు విఘాతం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 4375ను తక్షణమే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ అంశంపై సోమవారం సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, భాస్కర్, సంజీవుడు, సుబ్బారెడ్డి, వెంకట శివుడులతో కలిసి డీఆర్‌ఓ పద్మజకు వినతి పత్రం ఇచ్చారు.

8న వాహనాల వేలం

బొమ్మలసత్రం: జిల్లా కేంద్రంలోని నూనెపల్లి సమీపంలో ఉన్న సెబ్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 8వతేది వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన పలు రకాల వాహనాలను సెబ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం వేస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఎర్రం విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శని, ఆదివారాల్లో తిరుపతి జిల్లాలో జరిగిన రాష్ట్ర సమావేశాల్లో బజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్‌గా పోలేపల్లి సందీప్, వీహెచ్‌పీ నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా బేతంచెర్లకు చెందిన బుగ్గన చంద్రశేఖర్‌రెడ్డిని, రాష్ట్ర అధ్యక్షుడిగా నందిసాయిరెడ్డిని నియమించినట్లు వారు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): పాత బానకచర్ల, కొత్త బానకచర్ల, గూండాల నట్టు గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో నిరుపేదలు నిర్మించుకున్న ఇళ్లకు పట్టాలు ఇచ్చి మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై వారు సోమవారం ప్రజా పరిష్కార వేదికలో డీఆర్‌ఓ పద్మజను కలిసి వినతి పత్రం అందజేశారు.

నేడు విధుల బహిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): ఆళ్లగడ్డ సీనియర్ న్యాయవాది సుబ్బరామిరెడ్డిపై నంద్యాల సీఐ రాజారెడ్డి దాడి చేయడాన్ని నిరసిస్తూ నంద్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జనరల్ సెక్రటరీ భూపని వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం బార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయవాదుల సమావేశంలో వారు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాది సుబ్బరామిరెడ్డిపై సివిల్ కేసులో సీఐ రాజారెడ్డి కాలర్ పట్టుకొని అసభ్యకరంగా ప్రవర్తించాడన్నారు. వెంటనే సదరు సీఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి పత్రం అందజేశామన్నారు. న్యాయవాదులు మద్దిలేటిరెడ్డి, జీవన్‌రాజ్, భూమా వెంకటరెడ్డి, రామచంద్రారెడ్డి, సూరనాగరాజరావు పాల్గొన్నారు.

ప్రసన్నకు అన్ని విధాలా అండగా ఉంటాం



రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, ఆర్‌డీఓ మల్లికార్జున

చాగలమర్రి: చిన్నవంగలి గ్రామంలో మట్టిమిద్దె కూలి కుటుంబసభ్యులను కోల్పోయిన గురుశేఖర్‌రెడ్డి రెండో కుమార్తె గురు ప్రసన్నకు అన్ని విధాలుగా అండగాఉంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం ఆమె.. ఆర్‌డీఓ మల్లికార్జున రెడ్డితో కలిసి చిన్న వంగలి గ్రామంలో ప్రసన్నను పరామర్శించి ప్రభుత్వ సాయాన్ని అందజేశారు. బాలికకు రూ.10 లక్షలు, అవ్వ రామ సుబ్బమ్మకు రూ.2 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



● గురువు లేని బడి

పై చిత్రంలో ఉన్నది ఆళ్లగడ్డ మండలం బృందావనం గ్రామం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల. ఇక్కడ పనిచేస్తున్న టీచర్ గత ఏడాది పదోన్నతిపై బదిలీ అయ్యాడు. అప్పటి నుంచి ఎవరినీ నియమించకపోవడంతో ఆళ్లగడ్డ పట్టణంలోని పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడిని తాత్కాలికంగా డిప్యుటేషన్‌పై పంపుతున్నారు. రెగ్యులర్ టీచరేలేనప్పుడు బడికి పంపినా ఏం ప్రయోజనం అని తల్లిదండ్రులు తమ పిల్లలను పంపేందుకు పెద్దగా ఆసక్తి చూపడంలేదు.



● అన్ని తరగతులకు ఒకే టీచర్

ఇక్కడ ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతుల విద్యార్థులకు ఒకేసారి పాఠాలు బోధిస్తున్న ఈ పాఠశాల పట్టణ శివారులోని వీవర్స్‌కాలనీ ఎంపీపీ స్కూల్. ఇక్కడ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 21 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయుడు అన్ని తరగతుల సబ్జెక్టులు బోధించాల్సి రావడంతో పూర్తిస్థాయిలో న్యాయం చేయలేని పరిస్థితి ఉంది. విద్యార్థులకు బోధనతో పాటు పాఠశాలకు సంబంధించిన పనులు సైతం ఈయనే చేయాల్సి ఉంటుంది.



● సారు రాలె

పై చిత్రంలో విద్యార్థులు ఖాళీగా కూర్చున్న ఈ పాఠశాల జి.జమ్ములదిన్నె గ్రామంలోనిది. ఇక్కడి ఎంపీపీ స్పెషల్ స్కూల్ ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తారు. అయితే శాంతినగరం ఎంపీపీ స్కూల్ టీచర్ సెలవుపై వెళ్లడంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడిని తాత్కాలికంగా అక్కడకు పంపించారు. మిగిలిన ఒక ఉపాధ్యాయుడు అన్ని తరగతుల విద్యార్థులకు బోధన చేయలేడు కదా. దీంతో మిగతా తరగతుల విద్యార్థులు ఖాళీగా కూర్చోవాల్సి వస్తుంది.

సమస్యల పాఠం!

పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి చదువేనని నమ్మిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో, విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా బోధనా విధానాలు అమలు చేశారు. పాఠశాలలను సౌకర్యాల్లో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. అలాంటి పాఠశాలలు నేడు నిర్వహణ లేక కళ తప్పాయి. కూటమి ప్రభుత్వ పాలనలో నాణ్యమైన విద్య దేవుడెరుగు భావి భారత పౌరులుగా ఎదగాల్సిన విద్యార్థులకు కనీస అక్షరజ్ఞానం నేర్పేందుకు గురువులు లేరు. పలు పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నెట్టుకొస్తున్నాయి. వారు ఏదైనా పనిమీద సెలవు పెడితే ఆ రోజు దాదాపు బడికి సెలవే. ఇది నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ప్రస్తుత పరిస్థితి.



హరివారం ఎలిమెంటరీ స్కూల్‌లో అన్ని తరగతులను కలిపి పాఠం చెబుతున్న టీచర్

- కుంటుపడుతున్న విద్యాబోధన
- పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
- నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో 64 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- పేద పిల్లలకు అందని ద్రాక్షగా మారిన నాణ్యమైన విద్య
- నంద్యాలలో నాణ్యత లోపించిన మధ్యాహ్న భోజనం

నంద్యాల/ఆళ్లగడ్డ: సర్కారు బడుల్లో మౌలిక వసతుల సంగతెలా ఉన్నా.. బంగారు భవిష్యత్తు ఉన్న విద్యార్థులకు చదువు చెప్పేందుకు అవసరమైన ఉపాధ్యాయులు లేరు. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజవర్గాల్లో 422 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఏకంగా 64 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో అతితక్కువగా ముగ్గురు విద్యార్థుల నుంచి 30 మంది విద్యార్థులవరకు చదువుకుంటున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠాలు చెప్పేవారు లేక పేద విద్యార్థుల చదువులు చట్టబండలు అవుతున్నాయి. గిరిజన తండాలు, మారుమూల గ్రామాల్లో విద్యార్థులు ప్రాథమిక విద్యకు నోచుకోక నష్టపోతున్నారు. ఇలాగే కొనసాగితే 10వ తరగతికి వచ్చినవారికి కూడా చదవడం, రాయడం రాని దుస్థితి నెలకొనే ప్రమాదం ఉంది.

బడికెళ్లకుంటే కష్టమే!

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉండటం వల్ల పిల్లలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేని పరిస్థితి ఉంది. 20 మంది విద్యార్థులకు ఒకరు ఉండాల్సి ఉండగా.. అంతకన్నా ఎక్కువ మంది ఉన్నచోట కూడా ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ప్రస్తుతం ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇంటో శుభకార్యం లేక మరేదైన అత్యవసర పనిమీద సెలవు తీసుకోవాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సి వస్తోంది. ముందు రోజు సెలవు తీసుకోవాలంటే తప్పనిసరిగా సంబంధిత మండల విద్యాశాఖాధికారికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా సమాచారం ఇస్తే ఎంఈఓ మండలంలోని సమీప స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో ఒకరిని అక్కడికి పంపిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి ఒకరిని అక్కడకు తాత్కాలికంగా పంపడంతో ఇక్కడ పాఠశాలలో ఏకోపాధ్యాయుడు అన్ని చక్కబెట్టుకోవాల్సిన దుస్థితి. దీని వల్ల పిల్లలకు పూర్తి స్థాయిలో చదువు అందించలేని పరిస్థితి. అప్పటికప్పుడు తాత్కాలిక ఉపాధ్యాయుడు వచ్చినా.. ఆయన ఏమీ చెప్పలేని పరిస్థితి. ఇలా సక్రమంగా పాఠాలు చెప్పేవారు లేక, చదివేది అర్థం కాక కొందరు విద్యార్థులు ప్రభుత్వ బడులను వీడుతున్నారు.

విద్యార్థులకు అందని కోడి గుడ్లు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కింద వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు ఇచ్చేవారు. అయితే టీడీపీ ప్రభుత్వం వచ్చాక మధ్యాహ్న భోజన పథకం మార్చరేగాని మెనూ అలాగే ఉంచారు. అయితే నంద్యాల నియోజకవర్గంలోని పాఠశాలల్లో ఐదు రోజులుగా విద్యార్థులకు కోడిగుడ్లు అందించడం లేదు. మధ్యాహ్న భోజనం కూడా అప్పటికీ, ఇప్పటికీ నాణ్యత ఉండటం లేదని విద్యార్థులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మధ్యాహ్నభోజనం మెనూ ఉండేది. అదే స్థాయిలో విద్యాబోధన ఉండేది. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుత కూటమి సర్కారు పట్టించుకోకపోవడంతో మధ్యాహ్న భోజనం రుచి తగ్గిందని విద్యార్థులు చెబుతున్నారు.

ఆ ఒక్కడు కూడా రాకపాయె

2024–25 విద్యాసంవత్సరంలో నంద్యాల మండలం బ్రాహ్మణపల్లె గ్రామం ఎంపీయూపీ స్కూల్ ఒకే విద్యార్థితో నెల రోజుల పాటు సాగింది. ఆ విద్యార్థి సైతం ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలో చేరాడు. గత 20 రోజుల నుంచి కొత్తగా విద్యార్థులెవ్వరూ చేరలేదు. దీంతో ఆ స్కూల్ మూత దశకు చేరుకుంది. పాఠశాలల మెర్జ్ కింద సంబంధిత ఉపాధ్యాయురాలును పుసులూరు గ్రామం ఎంపీయూపీ పాఠశాలకు పంపే యోచనలో అధికారులు ఉన్నారు. మంచి విద్యనందిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులను చైతన్యం చేయాలే తప్ప పాఠశాలను మూతవేయాలనుకోవడం సరికాదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

అన్ని తరగతులకు సార్ ఒక్కరే



మా బడిలో ఐదు తరగతుల వరకు పిల్లలు ఉన్నారు. అందరికీ సారు ఒక్కరే పాఠాలు చెబుతున్నారు. సారు బడికి రాకుంటే పాఠాలు ఉండవు. అప్పుడప్పుడు వేరే సార్‌లు వచ్చినా ఆడుకోమని చెబుతారు. అన్ని సబ్జెక్టులు అందరికీ ఒక్క సారే చెబుతుండటంతో ఆసక్తిగా అనిపించడంలేదు. –లక్ష్మీదేవి, వీవర్స్‌కాలనీ

మా స్కూల్‌కు టీచర్‌ను నియమించాలి



మా సారు పోయిన సంవత్సరం చివరిలో ప్రమోషన్ వచ్చి ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ అయిపోయాడు. అప్పటి నుంచి మాకు టీచర్‌ను వేయలేదు. తాత్కాలికంగా టీచర్‌ను పంపుతున్నారు. దీంతో చాలామంది బడికి రాకుండా ఇంటిదగ్గర ఆడుకుంటూ.. పొలం పనులకు వెళ్తున్నారు. మా స్కూల్‌కు సార్‌ను నియమించాలి

– తేజమహి, బృందావనం

ఆళ్లగడ్డ నియోజకవర్గం

మండలం	మొత్తం స్కూళ్లు	టీచర్లు	ఏకోపాధ్యాయ పాఠశాలలు	విద్యార్థులు
దొర్నిపాడు	29	99	05	2068
శిరివెళ్ల	42	95	05	5092
ఉయ్యాలవాడ	32	112	13	2196
చాగలమర్రి	47	193	11	5460
రుద్రవరం	56	94	11	4605
ఆళ్లగడ్డ	68	101	05	5305
	274	694	50	24726

నంద్యాల నియోజకవర్గం

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	ఏకోపాధ్యాయ పాఠశాలలు
నంద్యాల	115	16,251	7
గోస్పాడు	33	3509	7
మొత్తం	148	19,760	14



● చిన్న చిన్న పనులతో పెండింగ్

మండల కేంద్రం ఉయ్యాలవాడ జెడ్పీ హైస్కూల్‌లో నిర్మిస్తున్న మరుగుదొడ్లు ఇవి. దాదాపు నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయి. లెట్రిన్ షీట్లు, డోర్లు, నీటివసతి, విద్యుత్, ఇతర సామగ్రిని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ మెటీరియల్ అంతా ప్రభుత్వమే సరఫరా చేయాల్సి ఉంది. ఇంకా చేయకపోవడంతో నిర్మాణం పూర్తయినా విద్యార్థులకు వినియోగంలోకి రాని పరిస్థితి.



● గుడ్డు లేని భోజనం

నంద్యాల మండలం చాపిరేవుల ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో ఐదురోజులుగా విద్యార్థులకు గుడ్లు ఇవ్వడం లేదు. దీనిపై తల్లిదండ్రులు ప్రశ్నిస్తే మధ్యాహ్న భోజనం ఏజెన్సీ వారు మాకు ఇవ్వడం లేదని, వారు గుడ్లు ఇస్తేనే మేము విద్యార్థులకు పెడతామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకం అమలు కావడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు.



● వేగం లేని నిర్మాణం

ఇది అమ్మిరెడ్డినగరంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం. ఇంటర్ మీడియట్ కాలేజీ మంజూరు కావడంతో వారికి సరిపడ 8 గదులను నిర్మించాల్సి ఉంది. వీటి నిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.94 లక్షలు మంజూరు చేసింది. దీంతో ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.31.15 లక్షల వరకు బిల్లులు మంజూరు చేసింది. 8 గదులకు గాను రెండుగదులు పూర్తవ్వగా మరోరెండు తుదిదశకు చేరుకుని ఆగిపోయాయి.



● 5 తరగతులు 10 మంది విద్యార్థులు

ఇది దొర్నిపాడులోని అమ్మిరెడ్డినగరంలో ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాల. ఇక్కడ ఐదు తరగతులకు కలిసి 10 మంది విద్యార్థులే ఉన్నారు. ఇందులో 2, 5 తరగతుల్లో విద్యార్థులు పూర్తిగా లేరు. మూడులో ఒకరు, నాలుగులో నలుగురు,ఒకటో తరగతిలో ఐదుగురు ఉన్నారు. ఏకోపాధ్యాయ బడి కావడంతో పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు.

పక్క చిత్రం నంద్యాల మండలం చాపిరేవుల గ్రామం ఎలిమెంటరీ ప్రత్యేక పాఠశాలలోనిది. ఈ స్కూల్‌లో ఐదుతరగతులకు గాను ఇద్దరు టీచర్లు ఉన్నారు. వీరిలో ఏ ఒకరు విధులకు హాజరు కాకపోయినా అన్ని తరగతుల విద్యార్థులను ఒకే గదిలో ఉంచి బోధన చేయాల్సి వస్తుంది.



గుర్రపు డెక్క తొలగించారు



వంతెనకు అడ్డుపడ్డ గుర్రపుడెక్కను తొలగిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో కుందూనదిపై నిర్మించిన వంతెనకు అడ్డుపడ్డ గుర్రపు డెక్కను అధికారులు తొలగిస్తున్నారు. సోమవారం సాక్షిలో 'ప్రమాదంలో వంతెన' అనే శీర్షికతో ప్రచురితం అయిన కథనానికి స్పందించిన రెవెన్యూ ఉద్యోగులు సాంబశివుడు, గంగాధర్, సర్పంచ్ శివరామిరెడ్డి గుర్రపు డెక్కను పరిశీలించారు. నీరు ఉధృతి అధికంగా ఉన్నా కూలీలతో తొలగింపు పనులు చేపట్టారు.

చెరువు కట్టపై గండి పూడ్చివేత



గండిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

రుద్రవరం:మండల పరిధిలోని కొండమాయపల్లె చెరువు కట్టపై గండి పడింది. ఈ విషయాన్ని ఆదివారం సాక్షి వెలుగులోకి తీసుకురావడంతో ఇరిగేషన్ అధికారులు స్పందించారు. వెంటనే వారు ఆయకట్టు రైతులు, గ్రామ పెద్దలతో మాట్లాడి గండిని పూడ్చేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ పనులను సోమవారం ఇరిగేషన్ డీఈ గురుమూర్తి, ఏఈ.మునాఫ్ పరిశీలించారు.

పకడ్బందీగా ఓడీఎఫ్ సర్వే

ఉయ్యాలవాడ : బహిరంగ మల మూత్ర విసర్జన రహిత గ్రామాలుగా మార్చి పరిశుభ్రంగా ఉంచేందుకు పకడ్బందీగా ఓడీఎఫ్ సర్వే చేయాలని ఎంపీడీఓ రఘురాం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటురోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మహిధర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ నరసింహరావు, మండల ఎంసీఓ రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

నంద్యాల(న్యూటౌన్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయమని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సీపీఐ మద్దతు తెలుపుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే ఎస్సీవర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, సీపీఐ నాయకులు సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల డుమ్మా

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మండలస్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. కేవలం డిప్యూటీ తహశీల్దార్ తులసిక్రిష్ణ, హెల్త్‌సూపర్‌వైజర్ రామచంద్రుడు, వెలుగు సీసీ గంగన్న మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీఓ రఘురాం, ఈఓపీఆర్‌డీ మహిధర్‌రెడ్డితో పాటు మరి కొందరు అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో వీసీ పని చేస్తుండడంతో అక్కడే హాజరయ్యారు. అయితే వివిధ సమస్యలపై వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రధాన అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

ఐరన్ మాత్రలతో రక్తహీనత దూరం



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కాంతారావు

రుద్రవరం: రక్తహీనత నివారణకు మహిళలు ఐరన్ మాత్రలు తీసుకోవాలని రాష్ట్రీయ బాల స్వస్థ ప్రోగ్రాం జిల్లా కో ఆర్డినేటర్ కాంతారావు సూచించారు. మండల కేంద్రం రుద్రవరంలో సోమవారం ఎఫ్‌డీపీని పరిశీలించారు. రోగులకు సక్రమంగా మందులు అందించాలని వైద్య సిబ్బందికి చెప్పారు. అనంతరం ఆయన జెడ్పీ ఉన్నత, కేజీబీవీ, ఏపీ మోడల్ పాఠశాలకు వెళ్లి అక్కడి వసతులు,తాగునీరు వంటివి పరిశీలించారు. అలాగే విద్యార్థులకు ఆరోగ్యంపై సూచనలు ఇచ్చారు. రుద్రవరం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నర్సాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బాబు,సీహెచ్‌ఓ హరిప్రియ, సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, డేటా ఎంట్రీ ప్రశాంత్,హెల్త్ అసిస్టెంట్ బాష, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ అన్యాయం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణ చేయడం అన్యాయమని రాష్ట్రీయ మాలమహానాడు నాయకులు అన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సోమవారం మాలమహానాడు నాయకులు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు లింగస్వామి మాట్లాడుతూ సామాజిక అంతరాలకు, ఆర్థిక అంతరాలకు మాలలు మాదిగలకు వ్యతిరేకం కాదన్నది సత్యమన్నారు. సరైన సామాజిక అంతరాలు తొలగాలంటే ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారాలు చూపాలి గానీ ఎస్సీలను విడగొట్టడం కాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, రాముడు, రాజశేఖర్, చెన్నయ్య, దేవదాసు, గుర్రంలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పాలకులకు పట్టని కార్మికులు, రైతుల గోడు



ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): కార్మికులు, రైతుల సమస్యలు పాలకులకు పట్టడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జాతీయ సమావేశాల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ప్రజలపై భారాలు మోపుతూ బడా కార్పొరేట్ సంస్థలకు రాయితీలను ప్రకటించిందని విమర్శించారు. ఇది ప్రజల ప్రభుత్వం కాదని దుయ్యబట్టారు. గుజరాత్ వ్యాపారస్తుల ప్రభుత్వమన్నారు. కార్మికులకు శాపంగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని, బ్యాంకింగ్, బీమా, రైల్వే టెలికాం అన్నింటిలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారని అన్నారు. ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖ పట్టణంలో పెద్ద ఎత్తున జరుగుతున్నాయని, మూడో తేదీన వేలాది మంది కార్మికులతో మహాప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, బాలకృష్ణ, జులేఖ, తిరుపాలమ్మ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ ప్రధాన కాలువను పరిశీలించిన ఈఈ

చాగలమర్రి: చాగలమర్రి మండల పరిధిలోని తెలుగుగంగ ప్రధాన కలువను ఈఈ శివశంకర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 58 కి.మీల వద్ద 2,548 క్యూసెక్కుల నీరు కాలువలో ప్రవహిస్తోందన్నారు. వారబంది విధానంలో బ్లాక్‌ల వారీగా సాగు నీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

నూతన చట్టాలపై అవగాహన అవసరం

ఉయ్యాలవాడ: నూతన క్రిమినల్ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సురేష్ సూచించారు. సోమవారం రూపనగుడి గ్రామంలో స్థానికులకు నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈఏ స్థానంలో బీఎన్ఎస్(భారతీయ న్యాయ సంహిత), బీఎన్ఎస్ఎస్(భారతీయ న్యాయ సురక్ష సంహిత) బీఎస్ఏ (భారతీయ సాక్ష్య అధినియం) సెక్షన్లను కూడా మార్చారన్నారు.

90 రోజుల పనిదినాలు కల్పించాలి

చాగలమర్రి: ఎన్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డు కలిగిన హౌసింగ్ పథకం లబ్ధిదారులకు 90 రోజుల పనిదినాలు కల్పించాలని ఏపీడీ సాంబశివరావు తెలిపారు. సోమవారం చాగలమర్రిలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఏపీడీఓ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ అసిస్టెంట్‌లు ఇంజినీరింగు అసిస్టెంట్లు, సిబ్బందితో సమావేశమై మాట్లాడారు.